
# వనవాసం

శ్రీలేఖ సాహితి... తెమ్మెర కథాసంకలనం



"చైతన్యం శిథిలమైన జగతి శిశిరం. శిశిరం వెన్నంటి ఉన్న చిగురాకే వరం..!"

– ఉదయాన్నే ఆలిండియా రేడియోలో వస్తూన్న భావగీతాన్ని ఆలకిస్తున్నాడేగాని, రామతారకంలో చిగురాకు స్ఫూర్తీ లేదు– చిగురాకును అంటివున్న వరమూ లేదు.

ఎప్పుడూ వెన్నెల మాట్లాడినట్టు, పుప్పొడి పూవునుండి వెలువడి పలకరించినట్టు, నిశ్చలమైన సెలయేరు తరంగనాదంతో పెదవి విప్పినట్టు, మహనీయుడు "యోపాం పుష్పం వేదా..." అంటూ మంత్రపుష్పం చదివినట్టుండే ఆ మనసంతా మసకబారి, శిశిరమయం అయినట్లుంది. ఊహలు ఆవిరై, ఆశయాలు అణగారిపోయి, బ్రతుకంతా బండబారినట్లుంది అంతరంగమంతా.

రాత్రి అంతా నిద్రలేదు. కళ్ళు కునుకు కోసం వెంపర్లాడుతూంటే- మనసు శిథిలమై, నిరాశ ముసుగులో ఘనీభవించినట్లుంది. కొడుకు వ్రాసిన ఉత్తరాన్ని రాత్రినుండి ఎన్నిసార్లు చదువుకున్నాడో! లెక్కలేనన్నిసార్లు చదివినా ధనుష్ స్వతంత్రంగా తీసుకున్న నిర్ణయాన్ని ఆయన మనసు ఆకళింపు చేసుకోలేకపోతోంది. అనంతపురంలో లెక్చరర్‌గా పనిచేస్తున్నవాడు అక్కడ ఎవరో అమ్మాయి మీద మోజుపడ్డాడంటే తట్టుకోలేకపోతున్నాడు.

"నాన్నా! ఇక్కడ మా కాలేజిలో లెక్చరర్‌గా పనిచేస్తున్న అమ్మాయి చాలా యోగ్యురాలు. ఆమె రూపలావణ్యం, సంస్కారం, వ్యక్తిత్వం నన్ను ఏదో తెలియని పాశంతో బందీని చేసింది. 'మేడ్ ఫర్ ఈచ్ అదర్' లాంటి మీ ఇద్దరి ద్వారా తీయని ఈ తనువు, పాజిటివ్ థింక్ చేయగల ఆలోచనా శక్తి, మీదైన చక్కని సంస్కారం, సంస్కారాన్ని పరిమళింపజేసే వ్యక్తిత్వం, మనిషిని మానవతతో గుబాళింపజేయగల విద్య, వివేకం పొందడం నా అదృష్టం. ఒకవిధంగా చెప్పాలంటే... ఆదిదంపతుల్లాంటి మీకు జన్మించడం నా పూర్వజన్మ సుకృతం. అటువంటి మీ కోడలిగా తగిన అర్హతలన్నీ ఈ అమ్మాయిలో మూర్తీభవించి ఉన్నాయని భావిస్తున్నాను.

ఇంతవరకు చదువుసంధ్యలలోగాని, ఆటపాటలలోగాని, ఉద్యోగ వ్యవహారంలోగాని మీ మాటను నేనెప్పుడూ కాదనలేదు. కానీ, నా జీవిత సహచరి విషయంలో నన్ను అర్థంచేసుకుంటా రనుకొంటున్నాను. అమ్మకు కూడా విషయాన్ని పెద్దమనసుతో విపులంగా చెప్పి, ఒప్పించగలరని కోరుతున్నాను!"

– మరోసారి ధనుష్ వ్రాసిన ఉత్తరాన్ని చదువుకున్న రామతారకం మనసు కకావికలమైంది.

కొడుకు ఎవర్నో పెళ్ళాడతానంటున్నాడన్న విషయం తెలిసి భార్య నాగమణి రాత్రి నుండి అన్నం ముట్టలేదు.

"ఇదేమి చోద్యమండీ! చెట్టంత కొడుకు పెళ్ళికి అందివచ్చాడు. శీఘ్రంగా వివాహం చేసి కోడల్ని తెచ్చుకుందామని ఆశిస్తే... ఆశల్ని నీరుగార్చి మనల్ని ఏటిలో ముంచుతున్నాడు. ఇప్పుడు భూషణం అన్నయ్యగార్కి ఏమి సమాధానం చెబుతాం? మరలా తోకలపూడి ఏ ముఖం పెట్టుకు వెళ్లగలం?"

– భార్య ఈసడింపు మాటల్ని వేదనాభరితంగా ఆలకిస్తున్న ఆయన మనోఫలకంపై తోకలపూడి, అక్కడి అయోధ్యా నిలయం... లీలగా కదలాడి హృదయం ఆనందమయమయింది. ఒక్కసారి అవధులు దాటిన ఆయన అంతరంగం రాగమయమై తనువులోని ప్రతి అణువు పులకించసాగింది.

'అయోధ్య... తరతరాల తమ అభ్యున్నతికి ఆధారం కదూ! పరాయివ్యక్తుల చేతుల్లో ప్రస్తుతం బందీగా ఉంది కదూ!!' అంతటి సంతోషంలోను ఆ ఊహ బండకన్నా బరువుగా అన్పించసాగింది.

'అసలు ఆ ఇల్లు, నాన్న దశరథ రామయ్యకు ఎంత ప్రాణం! ఆ మండువా, లోగిలిలోనే కదూ... తాను పుట్టింది! గృహలక్ష్మిలా ఇల్లంతా తిరుగుతూ తన ఆలనాపాలనా చూసిన అమ్మ మెట్టినిల్లు ఇదే కదూ! ఇక్కడే కదూ... అత్తయ్యకు పెళ్ళిచేసి మామయ్యతో అత్తారింటికి పంపింది!' భావవీచికల్లా జ్ఞాపకాలు చుట్టుముట్టి రామతారకాన్ని అతలాకుతలం చేయసాగాయి.

• • •

రామతారకంగారి తండ్రి దశరథ రామయ్య ఆ ఊరిలో ఒక సన్నకారు రైతు.

భూమిని దుక్కి దున్ని, సేద్యం చేసి, నాట్లు నాటి అందరికన్నా ఎక్కువ దిగుబడిని సాధించే ఆయనంటే ఆ ఊరిలోని వారందరికీ గౌరవం! చాలామంది ఆయన్ని ఆదర్శంగా తీసుకొనేవారు. ప్రతి ఏడాది ఏదో ఒక కార్యక్రమాన్ని ఏర్పాటుచేసి ఊరందరికీ ఆ ఇంట్లో సమారాధన చేసేవాడాయన. ఎప్పుడూ పండగ వాతావరణం నెలకొంటుంది ఆ ఇంటిలో. భర్తకు అన్ని విషయాలలోను చేదోడువాదోడుగా ఉండేది ఆయన భార్య.

కలిసిరాని కాలంలో దశరాథ రామయ్యగారి భార్య హఠాన్మరణంతో- ఆ ఇంట్లో పెనుమార్పులు సంభవించాయి. ఎక్కడో పట్టణంలో పైచదువులు చదువుకుంటూన్న రామతారకం... అకాల వర్షాలు, వరదలు వెల్లువలా ముంచెత్తడం, ఒక్కోసారి వర్షాలు లేక నాటిననాట్లు ఎండిపోవడం వంటివి జరగడంతో తీవ్రనష్టాలు వాటిల్లసాగాయి ఆయనకు. క్రమంగా అప్పుల ఊబిలో చిక్కుకున్న ఆయనకున్న తాతలనాటి ఆస్థిపాస్తులన్నీ హారతి కర్పూరంలా హరించుకుపోసాగాయి. అప్పటికి ఆయనకి మిగిలింది ఒక్క 'అయోధ్యా నిలయం' మాత్రమే. కొడుకు చదువు పూర్తయ్యేసరికి ప్రాణప్రదమైన ఆ ఇంటిని కూడా అమ్మకానికి పెట్టక తప్పలేదు.

"దశరథ రామయ్యగారూ! ఎదుటివారి మీద ఓ పాతిక వేలు ఎక్కువ ఇస్తాను. దయచేసి నాకు ఇప్పించండి!" అంటూ ప్రాధేయపూర్వకంగా అడిగిన స్నేహితుడు భూషణయ్యకు తన ప్రాణప్రదమైన ఇంటిని అమ్మి, కొడుకు పంచకు పట్నం చేరక తప్పలేదు ఆయనకు.

మంథర, కైకేయిల పోరు తమకు లేకపోయినా- రాముడు పుట్టి పెరిగి, హృదయాంతరాల్లో ఆత్మీయతా పరిమళాన్ని ఆపాదించుకున్న అయోధ్య నొదిలి వనవాసానికి బయలుదేరిన అనుభూతి నెలకొంది రామతారకం మదిలో! ఊహల ఊపిరిని గుండెగదుల్లో అపురూపంగా దాచుకున్న అతనికి- ఆ మండువా లోగిలి ఓ మధుర స్వప్నం. తలచుకొన్న ప్రతిక్షణం హృదయం పరిమళిస్తూంటుంది. తండ్రి ఇచ్చిన ఆత్మస్థైర్యంతో విద్యాధనాన్ని ఆర్జించి సమున్నతమైన స్థాయిని సంపాదించిన ఈ రాముని జీవితం ఉద్యోగ వనవాసంలో రాగమయంగానే సాగిపోయింది. చక్కని భార్య, అందివచ్చిన కొడుకు, మంచి ఉద్యోగంలో కొలువుదీరిన రామతారకం- దశరథ తనయుడుగా భాసిల్లాడు.

కాలం మనిషిని ముందుకు నడిపించి... నడిపించి చివరకు తనలో కలుపుకు పోతుందట!

దశరథ రామయ్య కాలగర్భంలో కలిసిపోయిన తరువాత రామతారకం మదిలో తండ్రి, తన బాల్యాన్ని మధురమయం చేసిన ఊరు, ఆ ఊరులోని తమ ఇల్లు, మస్తిష్కంలో ఎప్పుడూ కదలాడసాగాయి. సిరిసంపదలకు, భోగభాగ్యాలకు, కీర్తిప్రతిష్టలకు లోటులేని అతని మనస్సులో- కన్నతల్లిలాంటి ఆ ఇల్లు ఒక తీయని ఫలంగా మిగిలిపోయింది. తనలోని బాల్యం తాలూకు మధురమైన భావాలు భార్యతోగాని, కొడుకు ధనుష్‌తోగాని చర్చిస్తే- వాళ్ళు 'అంతా ట్రాష్' అంటారని, తననొక 'సెంటిమెంటల్ ఫెలో' అని అవహేళన చేస్తారని మిన్నకుండిపోయేవాడు. కానీ, తన స్మృతిపరిమళానికి ప్రతీక అయిన అయోధ్యను తిరిగి పొందాలనుకొనేవాడు.

'ఏమో! తన కల సాకారమవుతుందా..? ఎలాగైనా భూషణయ్యను ఒప్పించి ఆ శాంతినివాసాన్ని తిరిగి పొందాలి. ఆ ప్రాంగణంతో పెనవేసుకున్న తన భావసంపుటిని దృఢపరచుకోవాలి. ఆ పల్లెటూరులోని ఆ పెంకుల మండువా లోగిలిని ఎన్ని లక్షల రూపాయలైనా

సరే- కోరిన డబ్బు భూషణయ్యకు చెల్లించి స్వాధీనం చేసుకోవాలి. తమ కుటుంబ మనోవికాసానికి కేంద్రబిందువులాంటి ఆ అయోధ్యా నిలయం తోటి తన అనుభూతిని మదిలో పదిలపరచుకొనేవాడు నిరంతరం. ఆ ప్రాంతానికి క్యాంప్‌కి వెళ్లినప్పుడల్లా తోకలపూడి వెళ్లి పరిమళించిన మమకారంతో ఇల్లును చూసుకొని, భూషణయ్యను పలకరించి వచ్చేవాడు. ముందు తెలిసిన ఒకరిద్దరిచేత కబురు పంపాడు.

"భూషణయ్యా! ఇది మా తాతలనాటి ఇల్లు. మా నాన్న విధిలేని పరిస్థితులలో అప్పుడు నీకు అమ్మవలసి వచ్చింది. దానికి ఇప్పుడు నేను చాలా బాధపడుతున్నాను. ఒక్కమాటలో చెప్పాలంటే ఈ ఇల్లు నా సెంటిమెంట్. పట్నంలో నాకు రెండు బిల్డింగ్స్ ఉన్నాయి. కానీ, ఇది నా కన్నతల్లి లాంటిది. ఇక్కడ ఉంటే అమ్మఒడిలో ఉన్నట్లుంటుంది నాకు. కాబట్టి ఈ ఇంటిని నాకు తిరిగి అమ్మమని కోరుతున్నాను. మీకు ఎంత డబ్బు అయినా ఇస్తాను. అంతగా కావాలంటే మరోచోట మంచి బిల్డింగ్ కట్టించి ఇస్తాను" ప్రాధేయపూర్వకంగా అడుగుతున్న రామతారకాన్ని వింతగా చూశాడు భూషణయ్య.

"మనసున్న మనుషులు మసలిన మహత్తరమైన కోవెల ఇది. ఈ శాంతి నిలయంలో మా బ్రతుకులు ప్రశాంతంగా గడిచిపోతున్నాయి. జీవితంలో ఎంతో ఎత్తుపల్లాలని చవిచూసిన నేను- ఈ ఇల్లు కొన్న తరువాత నా జీవన శైలి మారిపోయింది. ఆర్థిక ఇబ్బందులతో సతమతమయ్యే నేను నిలద్రొక్కుకోగలిగాను. పట్టినదల్లా బంగారమైంది. సంతానం లేక నా భార్య కుమిలిపోతున్న సమయంలో మా బంగారుతల్లి ఉజ్వల కడుపున పడింది. తరువాత కాలంలో దేనికీ ఎదురులేకుండా పోయింది. అదంతా 'ఈ ఇల్లు కొన్న వేళావిశేషం' అని నా నమ్మకం!" అంటూ ఆవేశంగా చెప్పుకుపోతున్న భూషణయ్య మాటలు రామతారకాన్ని ఆలోచనల్లో పడేశాయి.

"మామయ్యా... కాఫీ తీసుకోండి!" అంటూ వినమ్రతగా కప్పుతో వచ్చిన ఆ అమ్మాయి వైపు వింతగా చూశాడు రామతారకం. పదిహేడు, పద్దెనిమిది సంవత్సరాల వయసున్న ఆ బంగారుతీగె పిలుపు- అతిమధురంగా తోచిందాయనకు. 'ఎవరా..?' అన్నట్లు భూషణయ్య ముఖంలోకి చూశాడు.

"మా అమ్మాయి ఉజ్వల! డిగ్రీ సెకండ్ ఇయర్ చదువుతోంది. ఉజీ! తారకం అంకుల్... అదే ఇంజనీర్ మావయ్య అని చెబుతుంటానే... ఈయనే!" అమ్మాయి వైపు తిరిగి అనేసరికి-

"నమస్తే..! ఎప్పుడూ మిమ్మల్ని చూడకపోయినా ఇప్పుడు చూడగానే అన్పించింది- మీరే మా తారకం మావయ్య అయిఉంటారని!" ఆ అమ్మాయి అభిమాన పూర్వకమైన మాటలు వింటుంటే ఏదో ఆత్మీయతా పరిమళం తనపై వెదజల్లినట్లయింది రామతారకానికి.

బిస్కెట్ కలర్ పట్టుపరికిణీ, దానికి మ్యాచింగ్ ఎర్రటి ఓణీ, నుదుట మహాలక్ష్మిలా కుంకుమబొట్టు, తలారా స్నానంచేసి పొందిగ్గా అల్లుకున్న జుట్టు, ఆ కురులను హత్తుకొనివున్న విరజాజులు, 'నవ్వితే ముప్పైఆరు రత్నాలు ఏరుకోవచ్చు' అనేంతటి కళాత్మకమైన దరహాసం, వయసు తెచ్చిన ఒంపుసొంపుల్ని మనసు కూర్చిన వ్యక్తిగతపు గుబాళింపుతో ప్రకృతి కన్యగా శోభిల్లే ఉజ్వలకు నూటికి నూరుమార్కులు వేశాడు రామతారకం.

పసిడి చేతుల్ని తళతళలాడించే బంగారు గాజులు, మెడలో సింపుల్‌గా లాకెట్ చైను, అతిశయం అంతగాలేని అతివను చూస్తుంటే ఆ తారకరాముని మాటల్లోని తెలుగింటి ఆడబడుచు సాక్షాత్కరించింది.

"కాసిన్ని మంచినీళ్లిస్తావామ్మా?!"

"ఇవి మీ బావిలోని నీరు... తీస్కోండి!"

ఛలోక్తిగా అంటూ ఇచ్చిన గ్లాసుని అపురూపంగా అందుకున్నాడు. నీళ్లు తాగి ఆమె ముఖంలోకి చూశాడు. పెద్దల పట్ల వినయపూర్వకమైన భావన ఆ కళ్ళలో కదలాడుతోంది.

"ఒరేయ్ తారకా! ఎప్పుడూ మనం పిల్లనిచ్చేటప్పుడు పెద్దకుటుంబంలో ఇవ్వాలి, కోడల్ని మటుకు చిన్నకుటుంబంలోంచి తెచ్చుకోవాలి. వినయం, అణకువ స్వభావాలు కలిగిన పిల్ల కోడలిగా వస్తే మనకు చివరిదశలో తనవంతు సేవ చేస్తుంది... ఇంత తిండి పడేస్తుంది!" ఆనాడు ఆ మండువా వరండాలోనే పడకకుర్చీలో అన్న తన తండ్రి మాటలు గుర్తుకువచ్చి మనసు ఆర్ద్రమైంది.

కొండల వెనక పారేసుకున్న జ్ఞాపకాల మూటని భుజాన వేసుకొని, ప్రతి రాత్రి వెన్నెల పువ్వుల్ని వెదజల్లి సేదదీర్చడానికి లోయల్లోంచి చంద్రుడు బయటకొస్తాడు. ఎప్పుడూ ఆ జ్ఞాపకాల రహదారిలో ఉక్కిరిబిక్కిరయిన మనసు ఊపిరి తీసుకుంటూ పచార్లు చేస్తూ ఉంటుంది. నిరంతరం ఊహల విన్యాసాలు చేసే ఆ పాదాలు రోదిస్తూనే ఉంటాయి. రుధిరం స్రవిస్తూనే ఉంటుంది. కాని, మజిలీ మాత్రం కనబడదు. ఎందుకో ఉజ్వల పట్ల ఆ క్షణంలో రామతారకం మదిలో మాతృభావం కదలాడింది.

"మావయ్యా! మీ ఇల్లు చూసుకోరా?!" అంటూ ఇంటిలోని ప్రతీ గదిని పేరుపేరునా చూపిస్తుంటే ముచ్చట కలిగింది. పెరటిలోని కొబ్బరిచెట్లని, వాటిప్రక్క నందివర్ధనం మొక్కల్ని చూస్తుంటే పులకించిపోయాడు. ఈశాన్యంలో బావి, దానినానుకొని ఉన్న జామచెట్టు, వరుసగా కరివేపాకు చెట్లు, గోరింటాకు మొక్కలు, గన్నేరు, సన్నజాజి, కనకాంబరం మొక్కలు అతని మదిపై పూలవాన కురిపించాయి.

'హిమశిఖరం నుంచి కరిగిన నీహారికా బిందు సందోహం నీటిచుక్కై కొండప్రక్క శిథిలమైన గుడిని ఆనుకొని ఉన్న కోనేట్లో కలువపూల రేకుల మీద చేరినంత నిర్మలంగా ఉంది ఆ అంతరంగం!'

– అనుభూతి పాశంతో ఉక్కిరిబిక్కిరవుతూంటే "మావయ్యా! ఈ గులాబి తోటని నేనే డెవలప్ చేశాను" దాదాపు పాతికపైన వివిధ రంగుల్లో ఎన్నో మంచిలక్షణాలను సంతరించు కున్నట్లుండే ఆ అయోధ్యా నివాసంలోని చెట్లు గాలికి ఊగుతూంటే, నీళ్లలో దీపాలు వదిలిపెట్టడానికి వంగిన ముత్తయిదువులా ఉంది ముద్దగులాబి. వరుసలో ఉన్న రోజాపుష్పాలు ప్రవాహంలో సాగిపోయే దీపాల్లా ఉన్నాయి.

"ఉజ్వలా! డిగ్రీ తరువాత ఏమి చెయ్యాలనుకుంటున్నావు?" పరిమళించిన పసుపురంగు గులాబీని సున్నితంగా చేతిలోకి తీసుకొని అన్నాడు.

"డిగ్రీలో స్కోరింగ్ ఎయిటీ పర్సంట్ ఉంది ఇంతవరకు మామయ్యా! కంప్లీట్ అయింతరువాత క్యాంపస్‌లో ఉండి ఎమ్.సి.ఎ. చేద్దామని ఉంది."

"మరి, మీ నాన్న ఏమంటాడు?"

"డాడీ చాలా మంచివాడు... నా మాటను ఎప్పుడూ కాదనరు!" అంది.

తను చూసిన గులాబి క్రింద ముళ్లు ఉంటాయని భ్రమపడ్డాడు. తీరాచూస్తే ముళ్లు లేకపోవడం ఎంత గొలిపించింది రామతారకానికి.

భోజనాలు చేసిన తరువాత భూషణయ్య- భార్య ఇచ్చిన తాంబూలం వేసుకొని నట్టింటిలో నడుం వాలుస్తూంటే, ఆ మాటా ఈ మాటా చెప్పిన తరువాత...

"తారకంగారూ! ఈ ఇంటితో మీకున్న అనుభూతిని నేను గ్రహించలేనిది కాదు. మీ మనసులో గూడుకట్టుకున్న ఆ మధురభావన చిరస్మరణీయంగా ఉండాలని నా కోరిక. మీ ఇంటిని మీకు ఒప్పజెప్పగల్గిననాడు మనిషిగా నాకు నేను జస్టిఫై చేసుకున్నట్లవుతుంది. లేకపోతే ఎక్కడో హైదరాబాద్‌లో మంచిపొజిషన్‌లో ఉన్న మీరు- ఈ చిన్న ఊరిలో, ఈ చిన్న పాతఇంటి కోసం ప్రాకులాడటం... అంతా మీ మంచితనం- అంతే! అందుకే నేను ఒక నిర్ణయానికి వచ్చాను. మా ఉజ్వల అంటే నాకు ప్రాణం! మంచిమనసుతో ఆమెను మీ కోడలిగా చేసుకోమని కోరుతున్నాను. నాకా ఒక్కగానొక్క కూతురు. మా బంగారు పట్టితోబాటు బంగారంలాంటి ఈ లోగిలిని ఆమెకు పసుపు కుంకుమల క్రింద ముట్టజెబుతాము. మీలాంటి సంస్కారవంతుల కుటుంబంలో నా కూతురు సుఖపడుతుందని నా ఆశ!"

"అవును అన్నయ్యగారూ! దశరథ రామయ్యగారు మాకు దారి చూపించిన దేవుడు. మీరు సహృదయులు. అటువంటి మీ ఇంటికోడలు కావాలంటే ఎప్పటినుంచో బంగారు పూలతో పూజలు చేసి ఉండాలి. కానీ, ఉజ్వలకి ఆ అర్హతలన్నీ ఉన్నాయనుకుంటున్నాను. మా అమ్మాయిని పెద్దమనసుతో మీ కడుపులో వేసుకోమని కోరుతున్నాను" భూషణయ్య భార్య మాటలు తనని ఆలోచనల్లో పడేశాయి.

ఆ అమ్మాయిని చూసినప్పటినుంచీ తను కూడా ఆమె గురించే ఆలోచిస్తున్నాడు...

'మనసంతా ఆత్మవిశ్వాసాన్ని నింపుకున్న ఆ అమ్మాయికి ఏమి తక్కువ? చదువుసంధ్యలు, అందచందాలకు మిన్న అయిన ఆమె- ఆదరణతో తనను ఎంతగానో ఆకట్టుకొంది. తమ కోడలిగా అన్ని అర్హతలూ కలిగిన ఈమెను చేసుకుంటే ధనుష్ తప్పక సుఖపడతాడు'

- అని మనసులో అనుకునేసరికి హృదయం ఎంతగానో పులకించింది అతనికి.

"మావాడు ఉద్యోగ ప్రయత్నంలో ఉన్నాడు. అమ్మాయికా- ఇంకా చదువు పూర్తికాలేదు. వారిద్దరికీ ఒకరికొకరు నచ్చితే నాకుగాని, నా భార్య నాగమణికిగాని అభ్యంతరం ఏమీ లేదు"

- అంటూన్న ఆయనలోని ఆత్మీయతా భావనకి ఎంతగానో పులకించింది ఉజ్వల అంతరంగం.

• • •

**జ్ఞా**పకాల వలయాన్ని వీడి బయటకు వచ్చిన రామతారకాన్ని కొడుకు వ్రాసిన ఉత్తరం అవహేళన చేయసాగింది.

ఉజ్వల గురించి తనవారితో పెదవి విప్పి చెప్పకపోయినా- కోడలిగా తెచ్చుకోవాలని ఎంతగానో అనుకున్నాడు. తద్వారా తన పూర్వీకుల ఇంటిని తిరిగి పొందవచ్చని మురిసిపోయాడు.

కానీ, కొడుకు 'ఎవరినో ప్రేమించాను, పెళ్ళిచేసుకుంటా' ననడం ఆయనను వేదనకు గురిచేస్తోంది.

"అంకుల్! నేను పెంచుకున్న గులాబితోట ఎలా ఉంది?" ఈశాన్యంలోని ఆ ఇంటి బావిలో నిర్మలంగా, స్వచ్ఛంగా ఉన్న నీటిలో ముఖం చూసుకుంటూన్న తనని ఉద్దేశించి అన్న ఉజ్వల మాటలు గుర్తుకువచ్చాయి.

'బాగున్నాయమ్మా! కాని, ఆ గులాబీల గుబాళింపుల్ని అందుకోలేని అవివేకుడమ్మా నా కొడుకు!' అని మనసు మూగగా రోదించసాగింది. ఒక్క రాయి విసిరేసరికి నిర్మలంగా ఉన్న బావినీరు చెల్లాచెదుర్తై, తన కలల ప్రతిబింబం చెదిరిపోయినట్లనిపించింది.

'ఏదిఏమైనా తన అనుభూతులు, ఉద్దేశాలు, సెంటిమెంట్స్ తనకే పరిమితం! వాటిని కొడుకు మీద రుద్దాలనుకోవడం ఎంతవరకు సబబు? తాను ఏదో- భూషణయ్య కూతురు తనకు కోడలయితే బాగుంటుందని ఆశపడ్డాడు. కానీ, జీవితాన్ని మలుచుకోవాల్సిందీ, కాపురం చెయ్యవల్సిందీ, ఆనందాన్ని పంచుకోవాల్సిందీ ధనుష్! ఉద్యోగం చేస్తూ తనంతటివాడైన కొడుకుని 'ఫలానా అమ్మాయిని చేసుకో'మని శాసించడం తనకు ఎంతవరకు న్యాయం? ఒకవేళ తనమాటని కాదనలేక ఉజ్వలను చేసుకున్నా సంతోషంగా కాపురం చెయ్యగలడా? కొడుకు నిర్వేదనతో జీవితాన్ని వెళ్లబుచ్చుతుంటే తండ్రిగా తాను భరించగలడా? 'తన ఇల్లు' అంటూ పిచ్చి సెంటిమెంట్‌ని కొడుకు పెళ్ళితో ముడిపెట్టడం ఎంతవరకు సబబు?'

- ఆలోచిస్తున్న రామతారకం మనసు గట్టిపడసాగింది. చివరకు కొడుకు కోరుకున్న అమ్మాయితో వివాహం జరిపించడానికి నిర్ణయించుకున్నాడు. అదే విషయాన్ని భార్యకు కూడా నచ్చజెప్పి చివరికి ఆమెను కూడా ఒప్పించగలిగాడు.

• • •

**ఆ**రోజు రామతారకంగారి మనసు ఆనందంతో ఉక్కిరిబిక్కిరవుతోంది.

పిల్లల పరిమళించిన హృదయ కుసుమాలు తమను స్వాగతిస్తున్నట్లనిపించసాగాయి.

"చూశారా వాడిని, దశరథ రామయ్యగారి మనవణ్ణి, ఈ రామతారకంగారి అబ్బాయిని? మీకు వేదన కలిగించే పని ఎలా చేయగలను చెప్పండి? మా కాలేజిలో ఎం.సి.ఎ. క్వాలిఫికేషన్‌తో జూనియర్ లెక్చరర్‌గా చేరిన ఉజ్వల మొదట్లో మన ఊరు తోకలపూడి అమ్మాయి అని తెలిసి పొంగిపోయాను. తరువాత మీరు ఎప్పుడూ చెప్తుంటారే- మన అయోధ్య నిలయాన్ని అమ్మింది భూషణయ్యగారికని! వారి అమ్మాయి ఈ అమ్మాయే... అని ఆమె మాటలలో తెలుసుకొనేసరికి తోకపట్టి ఆడించాలనిపించేది.

తాతయ్య ఖాళీచేసిన అయోధ్యలో మరలా అడుగుపెట్టాలన్న చిరుకోరిక మీ మాటల్లో ఎప్పుడూ వ్యక్తం చేయకపోయినా- నాన్న మనసు చదవగలిగిన నేను మీలో నిక్షిప్తమైన జీవితాశయాన్ని ఎప్పుడో గ్రహించగలిగాను. ఇక ఉజ్వల రూపలావణ్యం, సంస్కారం, వ్యక్తిత్వం నన్ను ఎంతగానో ఆకర్షించాయి. మీ సెలెక్షన్‌లో తేడా లేదని ఆనాడే నిర్ణయించుకున్నాను. ఇంతకాలం అయోధ్యకు దూరంగా వనవాసం చేసిన మనం మరల పూర్వవైభవాన్ని పొందగలుగుతున్నా మనిపిస్తోంది!" కొడుకు ప్రవర్తలోని నిజాయితీ రామతారకంగారిని అనురాగ డోలికల్లో ముంచెత్తసాగింది. కాబోయే వియ్యంకుడు భూషణయ్యగారి నుండి వచ్చిన పెళ్ళి శుభలేఖను అపురూపంగా చేతిలోకి తీసుకున్నాడు. దానిపై ముద్రించి ఉన్న వధూవరులు ఉజ్వల, ధనుష్‌ల ఫోటోలు ఉత్తేజాన్ని కలుగజేస్తున్నాయి.

శుభలేఖలో గోల్డ్‌లెటర్స్‌తో అందంగా ముద్రింపబడి ఉన్న 'అయోధ్యా నిలయం' అనే పదాన్ని అపురూపంగా స్పృశించసాగాడు రామతారకం.